# ఆఖరి అస్త్రం

బుల్లెన్నకు క్యాన్సర్ అని డాక్టర్లు నిర్ధారణ చేశారు. అప్పట్నుంచి బుల్లెన్నకు మనశ్శాంతి కరువైంది. ఆకలి మందగించింది. నిద్రపట్టడం లేదు. ఎప్పుడూ దిగులుగా కనిపిస్తున్నాడు.

బుల్లెన్న పరిపూర్ణ జీవితం అనుభవించాడు. ఆయన వయస్సు అరవై తొమ్మిదేళ్ళు. రాజకీయ వ్యాపారంలో బాగానే గడించాడు. కూతుళ్ళందరికీ పెళ్ళిళ్ళు చేశాడు. అల్లుళ్ళు మంచి పొజిషన్లోనే వున్నాడు. ఒక్కగా నొక్క కొడుకు వారసుడిగా రాజకీయంలోకి దించాడు.

మనిషికి ఇంతకంటే ఏం కావాలి?

మృత్యువు చేతులు చాచి ఆహ్వానిస్తుంటే తృప్తిగా కౌగలించుకోవచ్చు.

కాని బుల్లెన్న అసంతృప్తితో వేగిపోతున్నాడు.

తను చచ్చిపోతున్నానే అనే దిగులుతో కాదు. ఇంకా ఎంతోకాలం బ్రతకాలనే కోరికాలేదు. "జాతస్య మరణం ధృవం" అనే దానికి ఎవరూ అతీతులు కారు.

బుల్లెన్న చనిపోతే ఆ స్థానం సుబ్బరాజు ఆక్రమిస్తాడు. ఇద్దరూ ఒక పార్టీకి చెందిన వారైనా చిరకాలంగా రాజకీయ ప్రత్యర్థులు. అధిష్టానవర్గం ఎలాగో తంటాలుపడి ఇద్దర్నీ తృప్తిపరచడానికి వారి వర్గంవారికి పదవుల పంపిణీ చేస్తూ వుంది ఇంతకాలం. ఇద్దరూ సమవుజ్జీలు కాబట్టి అలా జరిగేది. కాని రేపు బుల్లెన్నపోతే పరిస్థితి ఇలా వుండదు. సుబ్బరాజు ఆధిపత్యం వహిస్తాడు. రాజకీయాల్లో తన కొడుక్కి ఎమ్మెల్యే సీటు కావాలన్నా సుబ్బరాజు మీద ఆధారపడవలసి వస్తుంది.

బుల్లెన్న బాధ అదే.

ఏంచెయ్యాలో పాలుపోక తీవ్రంగా ఆలోచించాడు. చివరకు ఒక్కటే పరిష్కార మార్గం కనిపించింది. అలా చెయ్యాలని నిర్ణయించుకున్నాడు.

టెలిఫోన్ ఎత్తి సుబ్బరాజుకు రింగ్ చేశాడు.

సుబ్బరాజు లైన్లోకి వచ్చి "హల్లో" అన్నాడు.

"నేనయ్యా బుల్లెన్నను"

"నమస్కారం బుల్లెన్నా ! చాలాకాలమైంది మనం కలిసి. క్షేమమేనా?" అడిగాడు సుబ్బరాజు.

"ఇంకెక్కడి క్షేమం సుబ్బరాజూ ! ఇక నా పని అయిపోయింది."

"ఏమిటి అలా వున్నారు? గొంతు చాలా వీక్‌గా వినిపిస్తోంది. వంట్లో బాగా లేదా?"

"ఆరోగ్యం రోజురోజుకీ దిగజారిపోతోంది సుబ్బరాజూ. ఇంకా ఎక్కువ రోజులు బండి లాగదు"

"ఛా...ఛా...అవేం మాటలు బుల్లెన్నా"

"నిజం సుబ్బరాజూ ! నాకు కేన్సర్ అని డాక్టర్లు డిక్లేర్ చేశారు"

"అరె...రె...! నాకు తెలీదే? ఎలా వుందిప్పుడు?"

"ఇంకా ఎలా వుండేదేమిటిలే. కేన్సర్‌కి మందు లేదుగా"

"చ్చ్...చ్చ్..." అని సుబ్బరాజు సానుభూతిగా అన్నాడు.

"మళ్ళీ నేను నిన్ను చూస్తానో లేదో సుబ్బరాజూ ! ఆఖరిసారిగా నీతో కాసేపు ప్రశాంతంగా మాట్లాడాలనుకుంటున్నాను"

"అయ్యో !...దానికేం భాగ్యం? అలాగే. ఇప్పుడే వస్తాను"

"వద్దులే. నేనే నీ దగ్గరికి వస్తాను"

"అలాగే"

"వెళ్ళిపోయే వాళ్ళకి వీడ్కోలు పార్టీ అంటారు చూడు. అలా నాకు డిన్నర్ ఇవ్వాలి నువ్వు. ఏదైనా హోటల్లో ఎరేంజ్ చెయ్యి"

"అలాగే బుల్లెన్నా !?"

"ఎవర్నీ పిలవకు. మనిద్దరమే ఏకాంతంగా, ప్రశాంతంగా మాట్లాడుకుందాము"

"అలాగే ! ఈరోజే ఏర్పాటు చేస్తాను"

"సాయంకాంలోగా ఫోన్‌చేసి చెప్పు ఎక్కడ ఎరేంజ్ చేశావో"

"ఆఁ... ఇప్పుడే చెప్తాను"

బుల్లెన్న రిసీవర్ క్రెడిల్ చేశాడు.

ఆఖరి క్షణాల్లో రావణబ్రహ్మ, లక్ష్మణుడికి రాజకీయ పాఠం నూరిపోసినట్లుగా కొడుకుని పిలిచి చాలాసేపు రాజకీయాలలోని మెలకువలు చెప్పాడు.

"నేనిక ఏ క్షణంలో అయినా పోవచ్చు. సుబ్బరాజుతో జాగ్రత్తగా మసులుకో !" అన్నాడు బుల్లెన్న.

కొడుకు తల వూపాడు.

సుబ్బరాజు ఫోన్ చేశాడు హోటల్ యువరాజ్, రూమ్ నెంబర్ రెండువందల మూడులో డిన్నర్ ఏర్పాటు చేశానని.

★ ★ ★

బుల్లెన్న వెళ్ళేటప్పటికే సుబ్బరాజు రూమ్‌లో వున్నాడు. అతన్ని చూసి ఆప్యాయంగా ఆహ్వానించి కౌగలించుకున్నాడు.

సుబ్బరాజుకి చాలా సంతోషంగా వుంది. బుల్లెన్న చస్తే పీడ విరగడైపోతుంది. ఇక తనకు ఎదురులేదు బుల్లెన్న కొడుకు దద్దమ్మ. తనతో ఏవిధంగానూ పోల్చడానికి వీల్లేదు. చదువుకున్నాడేగాని రాజకీయం వంటబట్టలేదు.

ఎటూ చస్తున్నాడు కాబట్టి తనతో రాజీపడడానికి బుల్లెన్న ప్రయత్నిస్తున్నాడని సుబ్బరాజుకి అర్థమైంది, కాటికి కాళ్ళు చాచి కూర్చున్నవాడు రాజీకి రాకేం చేస్తాడని అనుకున్నాడు.

సుబ్బరాజు స్వయంగా బీర్ బాటిల్ ఓపెన్‌చేసి ఒక గ్లాసు నింపాడు. రెండో గ్లాసులో బీర్ పొయ్యబోతుంటే బుల్లెన్న చెయ్యి అడ్డంగా పెట్టాడు.

"అసలే వాతావరణం చలిగా వుంది. బీర్ ఎట్లా తాగుతున్నావు? నాకు కాస్త విస్కీ పొయ్యి" అన్నాడు బుల్లెన్న.

"విస్కీ మానేసి చాలాకాలమైంది. అల్సర్ ఆపరేషన్ అయ్యాక డాక్టర్ వద్దన్నాడు. ఏదో అప్పుడప్పుడు ఫ్రెండ్స్‌తో కూర్చున్నప్పుడు కంపెనీ కోసం బీర్ మాత్రం తీసుకుంటు న్నాను" చెప్పాడు సుబ్బరాజు.

బుల్లెన్నకు విస్కీ బాటిల్ ఓపెన్‌చేసి పోశాడు.

ఇద్దరూ చాలాసేపు జిల్లా రాజకీయాలు స్టేట్ పొలిటిక్స్, సెంట్రల్లో గొడవలు మాట్లాడుకున్నారు.

ఎటూ కొద్దిరోజుల్లో తమ చచ్చిపోతున్నాడు కాబట్టి కొడుకుని కాస్త కనిపెట్టుకుని వుండమని సుబ్బరాజుతో చెప్పాడు బుల్లెన్న. పాత సంఘటనలన్నీ మర్చిపొమ్మన్నాడు. రాజకీయాలలో విరోధం శాశ్వతం కాదన్నాడు.

సుబ్బరాజు అన్నిటికి తలవూపాడు.

బుల్లెన్న వంటివాడు తనంతట తను వచ్చి లొంగిపోవడంతో సుబ్బరాజుకి ఏనుగు ఎక్కినంత సంబరంగా వుంది.

ఇద్దరూ ప్రశాంతంగా డిన్నర్ చేశారు.

"ఇక నువ్వెళ్ళు సుబ్బరాజూ ! చాలా పొద్దుపోయింది కూడా. నేను ఇక్కడే నిద్ర పోతాను. హాయి వుంది ఇక్కడ" అన్నాడు బుల్లెన్న.

సుబ్బరాజు అలాగే అన్నాడు. రేపు ఉదయం వస్తానని సెలవు తీసుకుంటానని అన్నాడు.

"తెల్లవారి ఆరుగంటలకు రమ్మని మా డ్రైవర్‌కి చెప్పు. ఇప్పుడు ఇంటికి వెళ్ళి పొమ్మను" అన్నాడు బుల్లెన్న.

సుబ్బరాజు తలవూపి వెళ్ళిపోయాడు.

★ ★ ★

తెల్లవారింది.

ఆరుగంటలకు బుల్లెన్న కారుడ్రైవర్ వచ్చి కాలింగ్‌బెల్ నొక్కాడు. తలుపు తెరుచుకో లేదు. పావుగంటసేపు ప్రయత్నించాడు. బుల్లెన్న తలుపులు తెరవలేదు. డ్రైవర్ అనుమానం వచ్చింది... ఆయన అంత మొద్దు నిద్రపోయే మనిషి కాదు.

"కొంపతీసి నిద్రలోనే పోయాడా !"

డ్రైవర్ హడావిడిగా వెళ్ళి కౌంటర్లో చెప్పాడు.

"సూపర్‌వైజర్ వచ్చి చూశాడు. తర్వాత మేనేజర్ వచ్చాడు. లోపల బుల్లెన్నకు ఏదో అయిందని నిర్ణయానికి వచ్చారు.

పోలీసులకు ఫోన్ చేశారు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ బలగంతో వచ్చాడు. డి.యస్.సి. వచ్చి నిల్చున్నాడు స్పాట్‌లో.

తలుపులు పగలకొట్టారు.

బుల్లెన్న చచ్చిపోయి వున్నాడు. శరీరం నీలిరంగులోకి మారి వుంది. ఆయన చేతిలో వుండచుట్టుకు పోయిన కాగితం కనిపించింది.

ఇన్‌స్పెక్టర్ బుల్లెన్న చేతివేళ్ళను బలవంతంగా విప్పి కాగితం తీశాడు.

అందులో బుల్లెన్న సంతకం చేసిన ఉత్తరం ఇన్‌స్పెక్టర్‌కి అడ్రెస్‌చేసి వుంది.

“సుబ్బరాజు నన్ను డిన్నర్‌కి పిలిచాడు. నాకు చిరకాల ప్రత్యర్థి అయినా అతని పిలుపు అందుకుని మర్యాద కోసం వచ్చాను. జిల్లా రాజకీయాల గురించి రహస్య సమావేశం అన్నాడు. తీరా ఇక్కడికొస్తే ఎవరూలేరు. నాకు ఏ అనుమానం రాలేదు. మళ్ళీ ఒక వారంలో మీటింగ్ పెట్టుకుందామని అంటే సరే అన్నాను. డిన్నర్ తీసుకున్నాను. సుబ్బ రాజు తను బీర్ మాత్రం తీసుకుని నాకు విస్కీ పోశాడు. డిన్నర్ పూర్తి అయిన తర్వాత నాకు నీరసం వచ్చినట్లయింది. కడుపులో ఏదో అలజడి చెలరేగింది. నేనిక కదలేక పోయాను. సుబ్బరాజు నన్ను కాసేపు విశ్రాంతి తీసుకుని వెళ్ళమని తను వెళ్ళిపోయాడు. ఆ తర్వాత నాకు తెలిసింది అతను విస్కీలో విషం కలిపి ఇచ్చాడని. నా చావుకి బాధ్యుడు సుబ్బరాజే’

*-స్వాతి మాసపత్రిక, 1987*